# సంసారమంటె స్వర్గం కాదు

''మన కమలానికి పెళ్ళిట"

"అబ్బాయి ఎవరుటా!"

"ఎవరేమిటి? పట్నంలో ఆపీసరుట! అమ్మాయిని చూసాట్టంతే! కట్నం లేకుండా పెళ్ళికి ఒప్పుకున్నాట్ట"

"చక్కటి చుక్క కమలం. పైగా బి.ఏ. పాసయింది. ఈవూళ్ళో అంత చదువు ఎవరు చదువుకున్నారే?

"అవునవును-అందుకే వెతుక్కుంటూ ఆఫీసరొచ్చాడు. కమల కుమారికి పెళ్ళి కుదిరింది మొదలు ఊరిడి మందికి సందడిగానె ఉంది. ఆ వూళ్ళో అందరు ఆమె పెళ్ళి సంగతే మాట్లాడుకుంటున్నారు.

"పట్నంలో ఇలా బావిలోంచి నీళ్ళు తోడుకోనక్కరలేదు. పైగా బోరు పంపులు కొట్టుకోను అక్కరలేదు."

"ఒదినా! ఆవూళ్ళో మురిక్కాలవలె ఉండవుట."

"అవును ఒదినా! అక్కడ యిళ్ళు అద్దాల్లా ఉంటాయిట. ఈ దాకిరీలె ఉండవుట."

"అవును వదినా! ఇలాంటి సంబంధం అందరికీ దొరుకుతుందా! పైగా కూరల బాధలు, పాలు పెరుగు బాధలు సరకులబాధలు ఉండవు. గుమ్మంలోనె దొరుకుతాయి."

కమలాకుమారి ఈ మాటలన్నీ వింటూనె ఉంది. ఎప్పుడు పెళ్ళై పట్నం వెడదామా అని ఎదురు చూస్తోంది.

అనుకున్న ముహూర్తం రానె వచ్చింది. శ్యామ్‌సుందర్ కాస్త చాయ్ తక్కువున్నా కమలం కంటికి సినీమా హీరో సుమన్‌లా కనిపించాడు.

పెళ్ళిలో ఆతని చెయ్యే ఒదలలేదు. శ్యామ్‌సుందర్ కూడా చాలా సంతోషంగా ఉన్నాడు.

కమలానికి చిన్నతనంనుంచి రమా, పద్మా ప్రాణంతో సమానం. వాళ్ళుకూడా కమలం స్వర్గ సుఖాలు చవిచూస్తుందనుకున్నారు.

"కమలా! నువ్వు వచ్చేటప్పుడు ఎక్కువ సామానులేమి తేకు.... నువొచ్చాక అక్కడే మనం కావలసినవి కొనుక్కోవచ్చు" శ్యామ్ సుందర్ వెళ్ళిపోతూ కమలానికి నచ్చచెప్పాడు.

"అలాగెనండి'' అంది కమల భర్తమీద వాలిపోతూ.

ప్రయాణం రోజు రానేవచ్చింది. కమలకి ఒకటే కంగారు. అటు ఇటు తిరుగుతోంది. కాని సరిగా ఏదీ సర్దుకోలేకపోతోంది. అందులో ఒంటరి ప్రయాణం. ఎప్పుడూ ఒంటరిగా ఎక్కడికీ వెళ్ళలేదు. ఆమె తల్లి తండ్రులు మరింత కంగారు పడుతున్నారు.

కమల వద్దంటున్నా వినిపించుకోకుండా మూటలు కడుతూనె ఉన్నారు. సామాను సర్దుతూనె ఉన్నారు.

రమా, పద్మా ఒక్క నిమిషం వదలడంలేదు.

"కమలా! నువ్వు స్వర్గంలో అడుగు పెడుతున్నావనుకో!

హాయిగా రోజుకో సినిమా చూడొచ్చు! నీ జాతకమే జాతకం'' పద్మ కమలని ఓ ఆట పట్టించింది.

"స్కూటర్‌మీద మీ ఆయన నడుం పట్టుకొని ఆయన మీద వాలి పోతూ సంధ్యా సమయంలో అలా చల్లగాలిలో షికార్లు చేస్తుంటే ఎంత బాగుంటుందో కమలా! తినబోతూ రుచులెందుకులే! అన్నట్లుగా అనుభవించబోయే నీకు నే చెప్పడం దేనికిలే? ఇంక మేముకూడ గుర్తుంటామోలేదో?" రమ కమలని కవ్విస్తూనె ఉంది.

"అన్నట్లు మరిచా కమలా! మీ అమ్మగారు ఆ వంట నేర్చుకో ఈవంట నేర్చుకో అంటు నిన్ను ఇబ్బంది పెట్టారుగాని అసలు నీకు వంట ఎందుకే! హాయిగా అలా బయటకు వెళ్ళినప్పుడల్లా హోటల్లో టిఫిన్లు, కాఫీలు, లంచ్‌లు, డిన్నరులు- ఇంక ఈ మామిడికాయ పప్పూ అన్నం ఎక్కడ గుర్తుంటుందిలే-ఈ పులిహోరలు, దద్దోజనాలు తయారు చేసె బాధ నీకెందుకులే." పద్మ మాటలకి కమల పకపకా నవ్వింది.

కమల నిజంగానె కొత్త జీవితంలోని అనుభవాలను తలచుకుంటూ మురిసిపోయింది.

"అమ్మా! ఇన్ని సామానులేమిటే! ఆయనకోపం చేస్తారమ్మా! ఆయన ఎక్కువ సామానులు తేవద్దన్నారమ్మా!'' కమల తల్లికి ఎన్ని సార్లో చెప్పింది.

"ఆయన అక్కడే సామానులు కొనుక్కుందామన్నారమ్మా! అని మాత్రం చెప్పలేక పోయింది.

"అమ్మో! నీకొక్కత్తికే మొగుడున్నాడమ్మా! ఎవరూ పట్నాల్లో కాపరాలె పెట్టలేదా? చాల్లేవే! ఎవరైనవింటే నవ్విపోతారు?'' అమ్మమ్మ కమల మాటలు కొట్టిపడేసింది.

రైల్లో ఓ బర్తుకింద చాలక కాళ్ళముందు కూడా కమల సామానె సర్దారు. రైలు కూత వేసింది.

"సామాను జాగ్రత్తమ్మా! వెళ్ళగానే ఉత్తరం రాయి. అతను స్టేషన్‌కి వస్తాడులే భయపడకు." అంటు తల్లి, తండ్రి, అమ్మమ్మ.... రమ, పద్మ అందరు చెబుతూనె ఉన్నారు.

రైలు కదిలింది. కమలకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. కావలసిన వారంతా కళ్ళొత్తుకుంటూ చేతులూపారు.

రైలు కదిలే సమయానికి కొంతమంది ఆ కంపార్టుమెంటులోకి ఎక్కారు.

"ఏమిటమ్మా! ఈ సామానంతా! ఒక్కటికెట్టుకి ఈ సామానేమిటమ్మా! విసిరి ఆవతల వడేస్తాం! సరిగ్గా సర్దుకో! అంటు ఒక ఆసామి బెదిరించాడు.

కమల నిజంగానె బెదిరిపోయింది. కాని ఆ ఆసామికి అరడజను మంది సంతానం మైనారిటీ తీరినవాళ్ళు మొదలు ఎల్.కె.జి చదివె వరకు వరుసగా ఉన్నారు. మరో పక్క భార్యామణి. అతని సామానుతో మిగిలిన కంపార్టు మెంటంతా నిండిపోయింది. కమల లేవడానికి లేదు. కాళ్ళు ముడుచుకోటానికిలేదు. తెల్లవార్లు వాళ్ళు ఎందుకో అందుకు కమలను సూటీపోటీ మాటలు అంటూనె ఉన్నారు.

"అబ్బో! యింత సామాను మాత్రం ఎప్పుడూ వెంట మోసుకెళ్ళకూడ"దనే నగ్నసత్యాన్ని తెలుసుకుంది కమల. జీవితంలో మరిచిపోలేని జ్ఞాపకం అనుకుంది. తెల్లవారగానే తను దిగవలసిన పట్నం రానే వచ్చింది. ఎక్కడైన శ్యామసుందర్ కనబడతాడేమోనని కిటికీలోంచి చూసింది. ఎక్కడా అతని జాడలేదు. కమలకి భయ్యం ప్రారంభమైంది. రాత్రి సామాను కాపలాతో కంటికి కునుకులేదు పైగా ఎదుటి వారితో కీచులాటలు. మనస్సు అసలే చిరాగ్గా ఉంది. ఇప్పుడీ శ్యామసుందర్ జాడేలేదు. ఆమె సామాను చూసిన కూలీలు తొందరచేస్తారు.

ముందు సామానంతా కిందకుదింపి పెట్టారు. వంద రూపాయలు ఇస్తే బయటకు తీసుకువస్తామన్నారు. మొత్తంమీద 75 రూపాయలకి మాట్లాడుకుంది.

"స్టేషను బయటకు వచ్చి సామానుతో నిలబడింది కమల. నిలబడలేక కాళ్ళు లాక్కుపోతున్నాయి. అక్కడ కూర్చోడానికి ఏ సిమెంటు బెంచీలులేవు. "ఛీ! ఛీ! ఇదేం స్టేషను!" రైలుస్టేషనుమీద విసుక్కుంది.

"ఇతనేం మనిషో ఏమో? రైలువచ్చి అరగంటయింది. ఇల్లు తెలీదు. అసలీవూళ్ళో రోడ్లే తెలీవు? పేటలపేర్లే తెలీవు? ఎలా వెళ్ళడం! ఎలా వెళ్ళడం! రమ్మన్నవారికి స్టేషన్‌కి రావాలని తెలీదనుకుంటాను. కాస్త మందబుద్ధిలావుంది." తర్వాత భర్తమీద విసుక్కుంది.

కమల పైకి విసుక్కున్నా లోపల భయంగానే ఉందామెకు. అందరూ కొత్తవాళ్ళే. ఒక్కళ్ళూ పలకరించారు. పైగా రౌడీలో, దొంగలో ఆమెను గుచ్చిగుచ్చి చూస్తుంటే భయంతో బణికిపోయింది. అంతమంది చుట్టూ జనంవున్నా నా అన్నవాళ్ళులేక ఆమె ఒంటరిదై పోయింది.

ఆ స్టేషనంతా ఒక అరణ్యంలా అనిపించింది. ఏ క్రూర మృగమైన మీదపడవచ్చు.

ఉన్న ధైర్యమంతా కరిగిపోయింది. ఏడుపు ముంచుకొచ్చింది. రెండు కళ్ళు బరువుగా నీళ్ళతో నిండిపోయాయి.

భయం భయంగా అటుఇటు చూస్తోంది. దూరంనుంచి స్కూటర్ వచ్చి దగ్గరలో ఆగింది. శ్యామసుందర్ రావడం మసగ్గా కనపడింది. కళ్ళు తుడుచుకుని చూసింది. శ్యామసుందరే! అంతలో సంతోషం.

"కమలా! ఆలస్యమైపోయింది. చాలా దూరంనుంచి రావాలి.

దారిలో స్కూటర్ పాడయింది. అది రిపేరు చేయించుకుని వచ్చేటప్పటికి ఆలస్యమైపోయింది. ఆదేమిటి భయపడి ఏడుస్తున్నావా?" ఆమె కన్నీళ్ళు చూసి అడిగాడు. తల అడ్డంగా తిప్పి మరోసారి కళ్ళు తుడుచుకుంది.

''ఇంటికి వెడదామా కమలా! స్కూటర్‌మీద వెళ్ళిపోదామా? నీ సామానెక్కడుంది.''

"ఇదిగో! ఇదే! కమల భయం భయంగా చూపించింది.

"ఏమిటీ! ఈ సామనంతా నువ్వే పట్టుకొచ్చావా? ఎంతపని చేసావు కమలా! సామాను తేవద్దని నీకు ముందే చెప్పాగా! ఈ సామానంతా యింటికి వెళ్ళాలంటే ఎంత కష్టమో తెలుసా! ఏ రిక్షావట్టదు. ఏ ఆటో పట్టదు. ఏ టాక్సీ పట్టదు?"

"ఒద్దంటుంటే మావాళ్ళే యిచ్చారు." కమల తలదించుకుని సమాధానమిచ్చింది.

"సరేలేఇప్పుడే వస్తా కమలా! కంగారుపడకు! ఎంతసేపనినిలబడతావు? ఆలా పక్కగా కూర్చో!" శ్యామసుందర్ సామానంతా పక్కకు సర్దాడు. ఆమెను ఓ ట్రంకు పెట్టెమీద కూర్చోమన్నాడు.

"ఓ జట్కా మాట్లాడి తీసుకువచ్చాడు. పట్నంలో ఇంకా అక్కడక్కడ జట్కాలు తిరుగుతున్నాయి. సామానులు తీసుకువెళ్ళడానికే కాదు కొందరు ఇంకా జట్కాలు ఎక్కుతూనేవుంటారు. శ్యామసుందర్ సామానంతా అందులో పెట్టించాడు. తాను స్కూటర్ స్టార్ట్‌చేసి ఆమెను వెనకాల కూర్చోమన్నాడు.

నిజంగానే కమల మొదటిసారిగా స్కూటర్ ఎక్కుతోంది. కమలకి పట్టరాని సంతోషం వచ్చింది. ఆమె శరీరం సన్నగా వణికింది. స్కూటర్‌మీద ఎలా కూర్చోవాలో శ్యామసుందర్ చెప్పాడు.

మెల్లిగా సీటుమీద కూర్చుంది. అతను ముందుకు జరగమనగానే ఆమె అతనికి మరింత దగ్గరగా జరిగింది. ఆమె చేయి అతని నడుం చుట్టూ వేసి అతను చెప్పినట్లుగానే గట్టిగా పట్టుకుంది. అంతవరకు పడ్డ బాధ మ చిపోయింది.

"రమ పద్మ చెప్పిన మాటలు చెవుల్లో గింగురుమన్నాయి. పట్నంలో కాపురముంటె స్వర్గంలో విహరించడమే అనుకుంది.

ఇంటికి వెళ్ళడానికి సుమారు గంటపట్టింది.

"వందా ఇచ్చేయండి" అన్నాడు జట్కావాల.

శ్యామసుందర్ వందరూపాయలు ఇస్తుంటె కమల "అమ్మో! వంద రూపాయలే" పైకే అనేసింది.

సామానుతో మొదటిగది నిండిపోయింది. వంటింట్లో ఆ సామాను పెట్టడానికి స్థలంలేదు.

"కమలా! మీ వూరునుంచి ఈ బిందెలనిండా నీళ్ళుతెస్తే బాగుం దేది!" శ్యామసుందర్ నవ్వుతూ అన్నాడు.

శ్యామసుందర్ ఎక్కడేమున్నాయో అన్నీ చూపించాడు. కమల అన్నింటికి తలూపింది.

"ఇంకా గాస్ రాలేదు. కిరసనాయలు స్టౌమీదే వండుకోవాలి. తెలిసిందా! ఈ పూటకు హోటల్లో భోజనం చేద్దాం! స్నానంచేసి బట్టలు మార్చుకో!" కిరసనాయలు స్టౌమీద వంట చెయ్యమంటాడేమోనని భయపడింది కమల.

శ్యామసుందర్ మాటలు వినగానే కమలకి పన్నీరు చిలికినట్ల యింది. వెంటనే స్నానంచేసి బట్టలు మార్చుకుని వచ్చింది.

"ఇక్కడికి హోటల్ చాలా దూరం. ఈ చుట్టుపక్కల మంచి హోటల్స్ లేవు! ఇప్పటికే లేటయింది. రా! భోజనంచేసి వద్దాం."

మరోసారి స్కూటర్ మీద వెడుతున్నందుకు కమల మనస్సు గాలిలో తేలిపోయింది.

భోజనం చేసి వచ్చాక ఇద్దరూ కలిసి సామానంతా సర్దారు. కమలపట్టుకొచ్చిన బిందెలు, చెంబులు పళ్ళాలు మూటకట్టించాడు శ్యామసుందర్. స్నానాల గదిలో పైన ఆటకవుంది. దాంట్లో పడేసి ఊపిరి పీల్చుకున్నాడు.

"మంచి నీళ్ళు తెల్లారాగట్ల నాలుగు గంటలకి రావచ్చు. రెండు రోజుల కొకసారె మంచి నీళ్ళు వస్తాయి. అవి పట్టుకోకపోతే తాగడానికి నీళ్ళుండవు; అలారం పెట్టాను." ఈసారి శ్యామసుందర్ మాటలు పిడుగుల్లా వినబడ్డాయి.

కమల పడుకుందన్న మాటెగాని "ఎప్పుడు నాలుగవుతుందో ఎప్పుడు నీళ్ళు వస్తాయో" అనుకున్న కమల కంటికి నిద్రేలేదు.

అలారం గంటలు కొట్టింది. శ్యామసుందర్ లేచి నీళ్ళు పడుతున్నాడు.

కమలకి అలారం మోగడం వినబడింది. కాని లేవలేకపోయింది. అసలే ప్రయాణపు బడలిక. తల్లి తండ్రుల్ని మొదటిసారిగా వదిలి వచ్చింది. మనస్సులో చెప్పలేని బెంగ. బాగా నిద్రపట్టే సమయానికి కరంటు పోయింది. ఫానాగిపోయింది. తిరిగి కరంటు వచ్చేటప్పటికి నీళ్ళు వస్తున్నాయి. శ్యామ్‌సుందర్ పడుతుంటె చూడలేక మెల్లిగా లేచింది కమల ఒక పక్క కళ్ళు మూతలుపడుతున్నాయి.

"నే పడతానండి! మీరు వెళ్ళి పడుకోండి" అంది కమల ఆవలిస్తూ.

"నువ్వు పడుకో కమలా!" శ్యామసుందర్ పడుకోమంటున్నా కమల పడుకోలేదు. మొత్తంమీద ఇద్దరూ కలిసి నీళ్ళు పట్టడం

మొదలెట్టారు. సన్నటిధార. ఎప్పటికీ బింది నిండడంలేదు.

"సామానుకాదు మీ వూరునుంచి నీళ్ళు తేవలసింది" అన్న శ్యామ సుందర్ మాటలు గుర్తుకువచ్చి నిద్రమత్తులోనె నవ్వుకుంది కమల.

అప్పటికే అయిదయింది. హాయిగా వెళ్ళి పడుకోవచ్చనుకుంది కమల. చిన్నతనంనుంచి కమలకి నిద్ర ఎక్కువ. బలవంతంగా లేపితే తప్ప ఎప్పుడూ నిద్రలేచేదికాదు.

"కమలా! నేను 8 గం॥కల్లా ఆఫీసుకు బయలుదేరాలి. నువ్వు 6 గం॥ వంట ప్రారంభించాలి. పైగా టిఫిను తయారుచెయ్యాలి. ఒక గంట పోయి పడుకో" శ్యామసుందర్ మాటలు గుండెల్లో శూలాల్లా దిగాయి.

"ఇదెక్కడి సంసారంరా బాబు! సంసారం సాగరం అని ఏ మహానుభావుడన్నాడో కాని ఈ సంసారం ఈదడం నాతరం కాదనుకుంది కమల.

"ఏదైన తప్పదు- కష్టపడితేనే ఫలితం" తాతమాటలు తలపుకు వచ్చాయి. కమల వెళ్ళి మంచం మీద పడుకుని కళ్ళు మూసుకుంది.

"కమలా! కమలా! నే ఆఫీసుకెడుతున్నా! తలుపేసుకో లే! లే!" అంటు అటు ఇటు శ్యామసుందర్ మంచంమీద దొర్లించాడు. మెళకువ వచ్చిన కమల పరిస్థితి గ్రహించి సిగ్గుపడింది. వెంటనే కంగారుగా లేవబోయింది.

"కంగారుపడకు కమలా! నేనుకాఫీ తాగాను. నీకుడికాషన్ రెడీగా ఉంది. నువ్వు మెల్లిగా వంటచేసుకో! నేను ఆఫీసు కాంటీన్‌లో ఈరోజుకి తింటాలే! ముందులేచి తలుపేసుకో!"

మెల్లిగా లేచి తలుపు గడియ వేసుకుంది. అప్పుడు గుర్తుకు వచ్చింది పని మనిషి సంగతి.

"ఈ ఇంట్లో పనిమనిషి లేదేమిటీ! ఎవరినైన మాట్లాడుకోవాలి. లేకపోతే అమ్మో! ఈ బట్టలు ఎవరు ఉతుకుతారు. ఈ గిన్నెలన్ని ఎవరు తోముతారు. అమ్మో ఇదెక్కడి బాధ్యతో" కమలకు నీరసం వచ్చేసింది. మళ్ళీ మంచంమీద పడుకోవాలనె ఉంది. అప్పటికే ఎనిమిది దాటింది.

"పనులు పూర్తి చేసుకుని పడుకోవచ్చు" అనుకున్న కమల పనులు ప్రారంభించింది.

అప్పటికే నాలుగు రోజులయింది. కమలకి విసుగ్గా ఉంది.

"కమలా! నీకు విసుగ్గా ఉందా! నేను శలవు పెడదామంటె శలవుల్లేవు! మొన్న మా నాన్నగారికి జబ్బు చేసినప్పుడు శలవలన్ని వాడేసుకున్నాను.

"నిన్ను సిటీలో అక్కడకి యిక్కడకి తీసుకువెళ్ళాలనె ఉంది. కాని ప్రస్తుతం లీవుల్లేవు కమలా! కొన్నాళ్ళు సర్దుకుపోవాలి కమలా!" అన్నాడు.

శ్యామసుందర్ ఆరాత్రి కమలను హృదయానికి హత్తుకుంటూ. "లీవులు పెట్టుకుని ఆరోడ్లన్ని తిరిగితే సుఖంరాదు. ఇదిగో నాకు ఇక్కడే వుంది సుఖం అంటూ కమలను అతని మరింతదగ్గరగా తీసుకున్నాడు"

"కమలా! నా బట్టలన్ని ఉతికించి ఇస్త్రీ చేయించు. బట్టలన్ని మాసిపోయాయి." శ్యామసుందర్ ఆఫీసుకి వెడుతూ కమలను పిల్చి చెప్పాడు.

"సరే" అంటు కమల తలూపింది.

ఆ పూట పనిమనిషి రాలేదు. చేసేదిలేక కమల అతని ఫాంటులు షర్టులు సబ్బులో నానపెట్టింది. పుట్టిన తరువాత ఎప్పుడు బట్టలుతక లేదు కమల. అసలావూళ్ళో ఎవరూ ఉతుక్కోరు. చాకళ్ళు ఉంటారు.

బట్టలన్నీ ఉతకడానికి చాలా సేపు పట్టింది. అన్నీ ఆరేసి వచ్చేటప్పటికి అలిసిపోయింది. సాయంకాలానికి వళ్ళు నెప్పులు చేసింది. కమలకి అను కోకుండా ఏడుపు వచ్చేసింది. వంటరిగా కూర్చుని వెక్కి వెక్కి ఏడ్చింది.

"రోజు బట్టలు ఉతుక్కోవాలంటె కష్టమే? ఈపని మాత్రం చెయ్యలేను" అనుకుంది కమల.

"బట్టలుతికించావా? కమలా" ఆఫీసునుంచి వచ్చిన శ్యామ్‌సుందర్ కాఫీ తాగుతూ అడిగాడు.

ఆ మాటలు వినగానె కమలకు వళ్ళు మండిపోయింది. "నేనెలా ఉన్నానో అడగడేం? బట్టలసంగతే కావాలన్నమాట" అతనుచూడకుండా పళ్ళు నూరుకుంది కమల.

"ఆ" అంది పొడిపొడిగా.

"బట్టలు ఇస్త్రీ చేయించావా?"

"లేదు? పనిమనిషిరాలేదు. ఇస్త్రీ చేసేవాళ్ళెక్కడుంటారో తెలీదు"

"ఈమాత్రందానికి ఇస్త్రీవాళ్ళెందుకు? ఇలాంటి పనులన్నీ నువ్వే నేర్చుకోవాలి? అలా ప్రతీదీ ఇస్త్రీకి పంపిస్తే ఎంతవుతుందో తెలుసా?"

ఆమాటలకి కమల మనస్సు చివుక్కుమంది.

"నేను పనిమనిషి ననుకుంటున్నట్టున్నాడు. ఇంటిపని వంటపనే కాదు! ఇలాటి కూలిపనికూడా నేనే చెయ్యాలి కాబోలు" కమల మనస్సు కులకుతలాడింది.

"నాకు ఇస్త్రీ చెయ్యడం చేతకాదు" అనాలనుకుంది. "నేనెందుకు చెయ్యాలి! నువ్వే చేసుకోవచ్చుగా" అని అడగాలనుకుంది.

"నేను చెయ్యను." అని సమాధానం చెప్పాలనుకుంది. కాని సమాధానం చెప్పలేకపోయింది.

"సరే" అంటు వంటింట్లోకి వెళ్ళిపోయింది.

వంటవేస్తూ ఆ విషయమే తలచుకుంది "ఈ మగవాళ్ళకి ఏం అహంకారం. ఆఫీసునుంచి వచ్చి కాలుమీద కాలేసుకూర్చుంటారు. ఆడవాళ్ళు ఊపిరి పీల్చుకోకుండా పనిచేస్తూనె ఉండాలి. అయినా వీళ్ళని కూర్చోపెట్టి పనులన్నీ చెయ్యడం అలవాటు చెయ్యకూడదు. చచ్చినట్లు చేసుకుంటారు. లేకపోతే డబ్బులిచ్చి చేయించుకుంటారు. నా బట్టలు మాత్రమే నేను ఇస్త్రీ చేసుకుంటాను. అయినా ఈ విషయాలన్నీ ఇంటికి తెలియజెయ్యాలి. రాత్రి ఉత్తరం రాస్తాను." ఆమె మనస్సు కాస్త ఊరట పడింది.

కుక్కరు విజిల్ రాగానె గాస్ ఆర్పేసి బయటకు వచ్చింది. శ్యామ్‌సుందర్ హాల్లోలేడు. ఎక్కడున్నాడోనని తొంగిచూసిన కమల ఉలిక్కిపడింది. గదిలో బట్టలిస్త్రీ చేస్తున్నాడు.

శ్యామసుందర్ ముందుగా కమల జాకెట్లు ఇస్త్రీచేసి మడతలు పెట్టి పక్కకుపెట్టాడు. తర్వాత తన చొక్కాలు ఇస్త్రీ చేసుకుంటున్నాడు.

"ఇలా రా! కమలా!" చిరునవ్వుతో పిలిచాడు.

సిగ్గుతో సగం ముడుచుకుపోయిన కమల మెల్లిగా దగ్గరగా వెళ్ళింది.

"ఇన్ని బట్టలు ఒకేరోజెందుకు ఉతికావు కమలా? ఒక జత ఉతికితే బాగుండేది. అనవసరంగా శ్రమపడ్డావు?"

కమల సమాధానం చెప్పలేకపోయింది.

"నీకు ఇస్త్రీ చెయ్యడం అలవాటు లేదుగా! అందుకే నేచేస్తున్నా! చూడు ఎలా చేస్తున్నానో! ఇదేం రానివిద్య కాదు, ఇట్టే వస్తుంది?"

కమల అతను ఇస్త్రీచేసి మడతలు పెడుతుంటే చూసింది.

"ఇంతేకదా!" అనుకుంది మనస్సులో.

రాత్రి శ్యామసుందర్ పడుకున్న తరువాత తలిదండ్రులకి ఉత్తరం రాయాలని మొదలుపెట్టింది. భర్తమీద ఉన్న కోపమంతా వాళ్ళకు తెలియచెయ్యాలనుకుంది.

ఎంత ప్రయత్నించినా ఉత్తరంలో ఏమి రాయాలో తెలియడం లేదు. మళ్ళీ ఆలోచనలో పడింది.

భర్త ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడ ఒకరికింద పనిచేస్తూ అలసిపోతాడు. ఇంటి సంగతులన్నీ చూసుకోవాలి. పెద్దవాళ్ళైన తల్లి దండ్రుల సంగతి చూసుకోవాలి. నిజంగా తనకు పనేమిటి? వంటచేసి అక్కడ పెడితే సాయంకాలం వరకు పనిలేదు. తినికూర్చుంటె కాల క్షేపమెలా అవుతుంది. ఏదోపని చేసుకోవాలి. ఆపని ఈ బట్టలుతకడం ఇస్త్రీ చేయడం కావచ్చుగా? అయినా అతను, నేను వేరుకాదుకా" కమల మనస్సు ఒక నిర్ణయానికి వచ్చింది.

రేపటినుంచి శ్యామసుందర్ చెప్పకుండానే అన్నిపనులు చెయ్యాలనుకుంది.

"తను, శ్యామసుందర్ కులాసాగా ఉన్నామంటూ ఉత్తరం నింపేసింది.

"కమలా! వచ్చేనెల మా అమ్మా నాన్న ఇక్కడికి వస్తున్నారు. కొంచెం ఖర్చులు తగ్గించుకోవాలి."

"అంటే నేను దుబారాగా ఖర్చుపెడుతున్నానా?" కమల పైకి అనాలనుకున్న మాటలు మనస్సులోనే అనుకుంది.

"నువ్వు దుబారా చేస్తున్నావని కాదు కమలా! ఇద్దరి మనుష్యులకు సరిపడిన అన్నానికి బదులు నలుగురికి సరిపడేటట్టు వండుతున్నావు? కూరలు కూడా ఎక్కువ వండుతున్నావు. అలాగె పాలు

కూడా? పొదుపు! లేకపోతే మన జీతాలు చాలవు?"

పొదుపు చెయ్యాలని ఎంతబాగా చెప్పాడు. అంటె నేను దుబారా చేస్తున్నట్లే కదా!

"ఆ వూళ్ళో అందరు నన్ను చాలా తెలివైనదానివి" అనేవారు. కాని ఇక్కడ నా తెలివితేటలు పనికిరావడం లేదు. ఇంత పొదుపు చెయ్యాలంటె నాతరం కాదు." అనుకుంది మనస్సులో.

అంత పొదుపు చెయ్యమని చెప్పినందుకు అతనిమీద చాలా కోపం వచ్చింది.

"అలాగె" అని తలాడించి అక్కడనుంచి కదిలింది.

అన్నింటికి కలగజేసుకుంటాడు "ఇదెక్కడు మగడురాబాబూ!" అంటు విసుక్కుంది.

"మీ యింట్లో ఎవరెవరుంటారమ్మా!" పక్కింటి పిన్నిగారు కూరలు కొంటుంటె పలకరించింది.

"నేను. మా ఆయన, "ఉంటామండీ!" కమల సమాధాన మిచ్చింది.

"అన్ని కూరలెందుకొంటావు! ఒక్క పావయితే మీ యిద్దరికి చాలుకదా! అయినా అమ్మాయి గుమ్మం ముందుకు వచ్చే ఈ కూరలు చాలా ఖరీదు. మీరు మార్కెట్టుకువెడితే చాలా తక్కువలో కూరలు దొరుకుతాయి. అక్కడ కొనుక్కొని తెచ్చుకోండి. లేకపోతే అనవస రంగా బోలెడంత డబ్బు ఖర్చవుతుంది. తెలిసిందా!" ఆవిడ మాటలకి ఆశ్చర్యపోయింది కమల.

"తనకుగాని, శ్యామసుందర్‌కిగాని ఆ ఆలోచన రానేలేదు.

ఆ మోండా మార్కెట్టుకు వెడితే డబ్బు తక్కువ ఖర్చవు

తుంది. కూరలెక్కువ వస్తాయి. అత్తమామలువస్తే అలాగె కొనుక్కో-వాలి" అనుకుంది కమల.

ఆరోజు శ్యామసుందర్ రావలసిన టైముకి యింటికి రాలేదు. కమలకి తెలియని కంగారు, భయం ప్రారంభమయ్యాయి. అప్పటికే రాత్రి పదిదాటింది. ఎవరిని అడగాలో ఏంచెయ్యాలో తోచలేదు.

తన యింట్లో ఫోనుకూడా లేదు ఇరుగు పొరుగులకి లేదు.

"ఫోనుకి దరఖాస్తు పెట్టి చాలా రోజులయింది. కాని ఇప్పట్లో రాదు! ఇంకో అయిదేళ్ళు కావచ్చు." భర్త మాటలు జ్ఞాపకం వచ్చాయి. "ఇలాంటప్పుడే ఫోనవసరం." కమలకి భయం ఎక్కువయింది. ఏ యాక్సిడెంటో అయిందో యేమోనన్న అనుమానం బయలుదేరింది.

రోజూ పేపర్లనిండా అవే చూస్తోంది. ఎక్కడకు వెళ్ళాలన్నా భయమే. ఎక్కడచూసినా జనం, కార్లు, ఆటోలు, రిక్షాలు, సైకిళ్ళు, ట్రక్కులు- ఎన్నో వాహనాలు.

"చెడు ఆలోచించకూడదంటారు. కాని అదే గుర్తుకువస్తోంది. అంతా పరిస్థితుల ప్రభావం. "ఏమాట వినవలసివస్తోందోనని" వీధి తలుపు దగ్గరే నిలబడింది. కమల. కాళ్ళు లాగుతుంటె నిలబడలేక వాలుకుర్చీ వేసుకుని అక్కడే కూర్చుంది.

అలసట మూలంగా కమలకి నిద్రపట్టేసింది. అన్ని బాధల నివారణకి వరం నిద్రేకదా!

తలుపు ఎవరో కొడుకుతుండే మెళకువ వచ్చింది.

"కమలా! కమలా!" అది శ్యామసుందర్ గొంతే! కమల కంగారుగా లేచి తలుపుతీసింది. నలిగిన బట్టలతో నీరసంగా నిలబడి ఉన్నాడు శ్యామసుందర్, అతని తలకి కట్లు.

"కమలకు అతనిని చూడగానే ఏడుపొచ్చింది. అతని గుండెల

మీద వాలి వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఏమయింది కమలా! ఎందుకేడుస్తున్నావు?" లోపలకి వస్తూ అడిగాడు.

అప్పటికి రాత్రి 12 గం॥ దాటింది.

"ఏదైనా యాక్సిడెంటు అయిందేమోనని భయమేసింది." ఇంకా వెక్కుతూనె చెప్పింది.

లోపలకి వచ్చిన శ్యామసుందర్ తలుపులు గడియ పెట్టాడు.

"నిజంగానే యాక్సిడెంటు అయింది. నాకు ఎక్కువ దెబ్బలు తగల్లేదు.కానిస్కూటర్‌పాడైపోయింది. వెనకనుంచిలారీవచ్చి కొట్టింది."

"లారీయా! అమ్మో!" కమల భయంతో మరింతవణికిపోయింది. మరోసారి గట్టిగా ఏడ్చింది.

"నాకేంకాలేదుగా కమలా! ఏడుస్తావెందుకు? స్కూటర్‌కి ఇన్స్యూరెన్సు ఉంటుందిలే, బాధపడకు. నగరంలో ఇవన్నీ మామూలే! అంత కంగారు పడకూడదు."

కమలను దగ్గరకు తీసుకుని ఓదార్చాడు.

ఆ పూటకు యిద్దరుకూడా భోజనం చెయ్యలేదు. వేడివేడి పాలు తాగి పడుకున్నారు.

"ఇంత కష్టమొస్తే ఒక్కళ్ళు చూడ్డానికి రాలేదు. కనీసం వచ్చి పలకరించలేదు. ఇదేం మనుష్యులండీ!" కమల ఆశ్చర్యంగా అడిగింది శ్యామసుందర్‌ని.

"కమలా! ఏమంత కష్టమొచ్చిందని బాధపడుతున్నావు. అయినా అలా ప్రతిదానికి అల్లరి చేసుకోకూడదు. నిన్ను ఓదార్చడానికి నేనున్నాగా! ఇంకా ఎవరు రావాలి? అందరు వచ్చి ఇంటిముందు కూర్చుని తెల్లవార్లు నిద్రలేకుండా చెయ్యాలా? హాయిగా పడుకో."

శ్యామసుందర్ మాటలకి సమాధానం చెప్పకుండానే కళ్ళు మూసుకుంది కమల.

అత్తగారు, మామగారు ఆరోజే వస్తున్నారు. కమల ముందురోజే ఇల్లంతా సర్దేసింది. వంటిల్లు పడకగదీ కాకుండా డ్రాయింగ్ రూమే ఉంది అందులో ఒక పక్కగా డైనింగ్ టేబులు, మరోపక్క కుర్చీలు- అత్తగారు, మామగారు వస్తే అక్కడే ఉండాలి.

అత్తగారు మామగారు రానే వచ్చారు. సామానంతా హాల్లో పక్కగా పెట్టించింది. శ్యామసుందర్ ముందురోజే ఒక ఇనుపమంచం కొనుక్కువచ్చాడు. మామగారికి హాల్లో ఆ మంచమేసి పక్కవేసింది.

వంటింట్లోకి వెళ్ళాలంటే ఆ మంచం పక్కనుంచే వెళ్ళాలి. రాత్రి భోజనాలయిన తరువాత అత్తగారికి నేలమీదే పరుపేసి పక్క వేసింది. పొద్దుటే ఆ పక్కతీసేస్తే తప్ప అటుఇటు తిరగడానికి లేదు. అత్తగారు లేస్తేతప్ప తను లేచి వంటింట్లోకి వెళ్ళడానికే లేదు.

కమలకి చెప్పలేని భయం పట్టుకుంది.

"ఎలా గడుస్తాయో రోజులు! సంసారమంటె యిన్ని గొడవ లుంటాయని తెలియదు. తెలిస్తే పెళ్ళే చేసుకోకపోదును." పడుకున్న కమల పదేపదే అనుకుంది.

అత్తమామలు రావడంవల్ల ఇంట్లో పనెక్కువైపోయింది. పని అలసటవల్ల కమల నిద్రలోకి జారిపోయింది. లేకపోతే ఆ బెంగవల్ల కమలకి నిద్రపట్టేది కాదు. అంతకంటె అలసటతో శ్యామసుందర్ నిద్రపోయాడు.

"కమలా! కమలా!" అత్తగారు అలా ఎప్పటినుంచి పిలుస్తోందో కమలకి మెళకువ వచ్చింది.

"అమ్మో! అత్తగారి కంఠంలా ఉంది. తెల్లారిందేమో? నాకు

మెలకువ రాలేదు. ఆవిడ ఏమనుకుంటుందో!" కమల కంగారుగా చీర సర్దుకుని తలుపు తీసుకుని బయటకు వచ్చింది.

"అత్తయ్యా! పిలిచారా!" కమల కిటికీలోంచి చూసింది. బాగా చీకటిగా ఉంది. ఎక్కడా వెలుతురు లేదు.

"అమ్మయ్య" గుండెలమీద చేతులు వేసుకుంది.

"అవునమ్మా! నేనే పిలిచాను, నాకు వెలుగు రాకుండానే కాఫీ తాగడం అలవాటు! గుక్కెడు కాఫీ పెట్టిస్తావని పిలిచానమ్మా!"

"అలాగా అత్తయ్యా! కాఫీ పెడదామంటే పాలు లేవత్తయ్యా!"

"రేపటినుంచి రాత్రి పాలు అట్టేపెట్టమ్మా! మీ మామగారికి కూడా వెలుగురాకుండానే కాఫీ తాగడం అలవాటు. అయినా పట్నంలో బూత్ పాలు 5 గం॥ వస్తాయని విన్నాను. మీరు పెందరాళె తెచ్చుకోరా?"

"ఇంత చీకట్లో తెచ్చుకోమత్తయ్యో! ఒకతను వతనుగా 6 గం॥ పట్టుకొచ్చి యిస్తాడత్తయ్యా! అప్పుడే కాఫీ తాగుతాం. అప్పుడే వంట ప్రారంభిస్తాను!"

"అలాగా! మేమున్నన్నాళ్ళు ఈ వేళలో కాఫీలబాధ తప్పదమ్మా! నీవెంట నేను వస్తాను. వెళ్ళి పాలపాకెట్టు తెచ్చుకుందాం! అమ్మా!"

"అబ్బో! ఇదెక్కడి బాధరా నాయనా! 4 గం॥ నీళ్ళువస్తాయి. 5 గం॥ కాఫీలు, 6 గం॥ వంట- అమ్మో! ఈ చాకిరీలు నేచెయ్యలేను. పట్నంలో కాపురమంటె స్వర్గసుఖాలుంటాయన్నారు. ఆ స్వర్గమంటె నేచూడలేదు. అసలు ఉందో లేదో తెలీదు. కాని సంసారమంటె నరకం. ఈ బాధలన్నీ నరకంలోని బాధలే! ఈ బాధలు నేపడలేను.

"హాయిగా స్కూటర్ ఎక్కి సినిమాలు చూడవచ్చు. షికార్లు

చేయవచ్చనుకున్నాను. కాని యిదేమిటి యీ యింటి పనులేమిటి. రాత్రి పడుకునేటప్పటికి 12 గంటలయింది. మళ్ళీ 4 గం॥ లేవాలంటే నేమనిషినా! మరమనిషినా! అదైనా బ్యాటరీ అయిపోతే ఆగిపోతుంది. అమ్మో! ఈ కష్టం నేభరించలేను, నేపుట్టింటికెళ్ళిపోతాను." కారే కన్నీళ్ళు అత్తగారు చూడకుండా తుడుచుకుంది.

"నేను రాలేను!" అని అత్తగారితో అనలేకపోయింది.

అత్తగారి వెంట బూత్‌పాలకి బయలుదేరింది.

కళ్ళు మూతలు పడుతుంటె బలవంతంగా తెరచుకుని కాఫి పెట్టి అత్తగారికి మామగారికి యిచ్చింది.

తరువాత వంట ప్రారంభించింది.

శ్యామసుందర్ లోంచేసి ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

ఒకవక్క చికాగ్గా ఉంది. మరోవక్క నిద్ర ముంచుకువస్తోంది. కమల గదిలోకి వెళ్ళి మంచంమీద వాలిపోయింది.

"కమలా! కమలా!" అంటు అత్తగారు కమలచేతిని తడుతూ పిలిచింది.

ఈసారి కమల కళ్ళు తెరవలేకపోయింది. మరీ బద్ధకంగా అనిపించింది.

"అత్తయ్యా! అన్నీ టేబులుమీదే పెట్టాను. మామగారికి అన్నం మీరు పెడితేనే బాగుంటుంది." కళ్ళు మూసుకునే సమాధానమిచ్చింది కమల.

"అత్తగారింకేమి అనలేక వెళ్ళి భర్తకి అన్నం వడ్డించింది.

''ఈ పిల్ల చాలా పెంకిదానిలా ఉంది విన్నారా! పిలిస్తే ఎంత మొండిగా సమాధానమిచ్చిందో!"

''ఆ విన్నాను! విన్నాను. ఏదో చిన్నపిల్ల. పాపం అంతపని

ఆ పిల్లే చేసుకుపోతోందిగా! నిద్రలో ఉన్నట్టుంది! అనవసరంగా ఎందుకు లేపావు!"

"ఆఘోరించినట్టే ఉంది. మీతో చెప్పడం నాదీ బుద్ధితక్కువ." భర్త మాటలు విని విసుక్కుందావిడ

కమల మధ్యాహ్నం లేచింది. మామూలుగానే పనులు చేసుకుపోతోంది. అత్తగారు మామగారు ఉండడంవల్ల పనే తీరడంలేదు. వారికోసం ఎవరో ఒకరు వస్తూనే వున్నారు. వంటలు, పిండవంటలు, కాఫీలు, టిఫిన్లు. అలా ఏదో ఒక పనితో కాలక్షేపం అయిపోతోంది. కమలకి పగలు రాత్రి తెలియడం లేదు.

భార్యాభర్తలు నెలకి కొనుక్కున్న సరుకులన్నీ వారంరోజుల్లో అయిపోయాయి. కూరలు, పాలు, పళ్ళు అలా కొంటూనె ఉన్నారు.

"కమలా! డబ్బు ఎంత ఖర్చవుతుందో చూసావా? ఇప్పటికి రెండు వేలు అప్పుతెచ్చాను. ఎలాగో! ఏమిటో!" శ్యామసుందర్ బాధగా అన్నాడు.

"అలాగా! నేనేం చేయనండీ" కమల మరింత బాధగా అంది.

"నీ నగలేమైనా ఉంటే బాంక్‌లో పెట్టి డబ్బు పట్టుకువస్తాను." నీ నగలు అడగడం తప్పే! కాని ఈ పరిస్థితుల్లో ఏం చెయ్యలేను."

"నా దగ్గర అంత ఖరీదైన వస్తువులేమి లేవు! పెళ్ళిలో నగలు మీరేమి పెట్టలేదు. మావాళ్ళు పెట్టినవి అక్కడే ఉన్నాయి. నా మెడలో పుస్తెలతాడు కాకుండా ఒక్క గొలుసు వుంది. అదిస్తాను. అమ్మే సేయండి."

"అవును! అది తాకట్టు పెడితే డబ్బేమిరాదు. అందుకే అమ్మేసేయండి. 4 వేలైన వస్తాయి." కమల ధైర్యంగా సలహా ఇచ్చింది.

"నిన్నటివరకు ఎక్కువ మాట్లాడని కమల ఇంత తెలివైనదా!"

శ్యామ్‌సుందర్ మనస్సులోనే అనుకున్నాడు.

కమల మెడలోంచి గొలుసుతీసి అతని చేతిలో పెట్టింది.

కమల ఆలోచనలో పడింది.

"అత్తమామలు కొన్నాళ్ళిక్కడే ఉండేటట్టున్నారు. అయినా వాళ్ళని శ్యామసుందరే చూడాలి— పెద్ద కొడుకు మిలటరీలో పని చేస్తాడు. ఎక్కడో దూరంగా ఉన్నాడు. వీళ్ళక్కడికి వెళ్ళలేరు. మూడో కొడుక్కి సరియైన ఉద్యోగంలేదు. అతను భార్యా పిల్లల్నే పోషించుకో లేడు. అయినా యిన్నాళ్ళు అతనిలోనే ఉన్నారు: ఇప్పుడిక్కడికి వచ్చారు. మధ్య కొడుకు శ్యామసుందరే తల్లి తండ్రుల్ని చూడాలి. వాళ్ళని చూడొద్దని చెప్పే నీచురాలు కాదుతను. కాని వారిని పోషించే దెట్లా! చాకిరీచేసేదెట్లా!" కమలకి అదే ఆలోచన, కమల ఎంత ఆలో చించినా ఆ సమస్యకి పరిష్కారం మాత్రం దొరకలేదు.

ఆరోజు సాయంకాలం పద్మవాళ్ళ నాన్నగారు కమలని చూడ్డా నికి వచ్చారు.

"రండి! బాబయ్యగారు! రండి! ఊరునుంచి ఎప్పుడు వచ్చారు!" కమల ఆయన్ని నవ్వుతూ ఆహ్వానించింది.

"నిన్ననే వచ్చాను. మీ నాన్నగారు నిన్ను రమ్మని ఎన్ని ఉత్త రాలు రాసినా నువ్వు వస్తావనె రాయడం లేదటగా! అందుకే నిన్ను చూసి రమ్మన్నారు మీ నాన్నగారు?"

"నాన్నగారు అమ్మ అందరు కులాసాగా ఉన్నారా! పద్మ ఎలా ఉందండీ! అయినా మా మామగారు అత్తగారు రాకరాక వచ్చారు. వాళ్ళను వదలి ఎలా రాను చెప్పండి!"

"నిన్న మొన్నటివరకు చిన్నపిల్లలాగంతులేసె నువ్వేనా ఎంత

పెద్దదానివై పోయావమ్మా! మనిషిని బాధ్యతలే తీర్చిదిద్దు తాయమ్మా!" ఆయన ఆశ్చర్యంగా అన్నారు

"ఉండండి బాబయ్యగారూ! కాస్త కాఫీ పట్టుకొస్తా!" ఆయన వద్దంటున్నా వినిపించుకోకుండా కమల వంటింట్లోకి వెళ్ళింది

ఆరోజు అత్తమామలు ఎవరో చుట్టాలుంటె వారిని చూడ్డానికి వెళ్ళారు. కమలకి కాస్త విశ్రాంతి దొరికింది.

ఉప్మా చేసి ఆయనకు పట్టుకొచ్చి యిచ్చింది. తరువాత కాఫీ కలిపి పట్టుకొచ్చి అక్కడ పెట్టింది

"కమలా! ఇవన్నీ ఎందుకమ్మా! అనవసరమైన శ్రమకదా! నువ్వు బి.ఏ. పాసయ్యావు కదా! ఇప్పుడేం చేస్తున్నావు?"

"చెయ్యడానికి తీరికెక్కడిది బాబయ్యగారు. ఇంటిపనితోనె సరి పడుతోంది."

"ఇంటిపనికే ముందమ్మా! మీ అత్తగారున్నారుకదా! కాస్త సహాయంచేస్తారు. ఆ వూళ్ళలోనె బి.ఏ. పాసయిన నువ్వు ఇక్కడ యిలా వుంటె ఎలా? ఎక్కడైన ఉద్యోగం చెయ్యమ్మా! ఇలాటి వూళ్ళల్లో యిద్దరు సంపాదించుకుంటె తప్ప సంసారాలు గడవ్వు తెలిసిందా!"

"నాకన్నీ తెలుసు బాబయ్యగారూ! ఈవూళ్ళోనాకుద్యోగం యిచ్చె దెవరు చెప్పండి! నేనేం చెయ్యగలను చెప్పండి."

"అలాగంటె ఎలాగమ్మా! ప్రయత్నం చెయ్యాలికదా! ఈవూళ్ళో నా స్నేహితుడొకడున్నాడు. వాళ్ళది పెద్ద వ్యాపారం అందులో నీకు ఉద్యోగ మిప్పిస్తానమ్మా! శ్యామసుందర్‌తో చెప్పు! ఈ రోజుల్లో ఆడ వాళ్ళిలా చేతులు ముడుకుని ఇళ్ళల్లో కూర్చుంటే కాదమ్మా! చొరవగా ముందుకు రావాలి. సంసారాలను బాగుచెయ్యాలి. తెలిసిందా కమలా!"

ఆయన మాటలకి కమల ఆశ్చర్యపోయింది. "వయస్సులో ఉన్న తనలాటి యువతరంకంటె వయస్సుమీరిన ఆయన ఎన్నోరెట్లు నయం" అనుకుంది.

"శ్యామసుందర్ కాదనడు. నేను మాట్లాడుతాను. మీరు నాకు ఉద్యోగమిప్పించండి." ప్రాధేయపడుతూ అడిగింది

"రేపు నేను వచ్చి నిన్ను తీసుకువెడతాను. ఈ సాయంకాలమె నా స్నేహితునితో మాట్లాడుతాను." ఆయన లేచి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి శ్యామ్‌సుందర్‌తో అన్నీ చెప్పింది:

"నీకు ఉద్యోగం ఎందుకు కమలా? అనవసరమైన శ్రమకదా!" అన్నాడు పైకి. "ఈ సమయంలో ఆయన దేముడులా వచ్చాడు. కమల ఉద్యోగం చేసి సంపాదించడం చాలా ముఖ్యం. లేకపోతే అప్పులపాలై పోతాను." శ్యామసుందర్ మనసులోనె పద్మ తండ్రికి చేతులు జోడించాడు.

"అమ్మా! కమల ఉద్యోగంలో చేరుతుంది. ఆమె వచ్చేటప్పటికి సాయంకాలమవుతుంది. ఇంట్లో జాగ్రత్తగా ఉండండమ్మా! తలుపులు జాగ్రత్తగా వేసుకుని గడియలు పెట్టుకోండి!" శ్యామసుందర్ తల్లికి కమల ఉద్యోగంలో జేరే సంగతి చెప్పాడు.

"అదేమిట్రా! దానికి ఉద్యోగం ఎందుకురా!" తల్లి మాటలు వినిపించుకోలేదు శ్యామసుందర్.

"కమలా! ఆలస్యమవుతోంది రా! రా!" అంటు పిలిచి కమల బయటకురాగానే స్కూటర్‌మీద బయలుదేరి ఇద్దరు వెళ్ళిపోయారు.

"ఇదేమిటండీ! ఈ రోజుల్లో కోడళ్ళకి మంచిచెడూ తెలీదు. కనీసం అత్తమామలం మనముండగా మనకి మాటవరుసకైన చెప్పొద్దుటండీ!"

"ఊరుకో! ఊరుకో! మనకు చెప్పేదేమిటి? అయినా అబ్బాయి చెప్పాడుగా! వాళ్ళ కష్టసుఖాలు వాళ్ళే చూసుకుంటారు! మనకెందుకు?" భార్యను మందలించాడాయన.

ఆఫీసులో అడుగుపెట్టిన కమల వణికిపోయింది. ఆమెను సీటులో కూర్చోపెట్టి శ్యామసుందర్ ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

ఆఫీసులో పెద్ద పనిలేదు. అందరు ఆప్యాయంగా కమలని పలకరించారు. చెప్పిన పని జాగ్రత్తగానే చెయ్యడం ప్రారంభించింది. ఆమె మనస్సు కాస్త కుదుటపడింది.

అంతలో ఒకతను వచ్చి ఆమె టేబులుముందు నిలబడ్డాడు. కమల తలెత్తి చూసింది.

"ఇదివరకెక్కడా పనిచెయ్యలేదా? మొదటిసారిగా ఆఫీసులో అడుగుపెట్టావా?"

"అవును" ఆమె మాటలు తడబడ్డాయి. అతని చూపులు వెగటుగా అనిపించాయి. అతని మాటలు చికాగ్గా వినిపించాయి.

"ఎక్కడుంటావు?"

ఈసారి కమల సమాధానం చెప్పలేదు.

"నిన్నే అడుగుతోంట" తిరిగి అడిగాడు.

పక్కసీట్లో కూర్చున్న మాలతి అతన్ని చూసి "వాడుట్టి మోసగాడు. ఆఫీసులో పనిచేసే ఆడపిల్లల్ని మోసంచేసి వలలో వేసుకోడమే అతని పని. అతనో వేటగాడు మోసగాడు." మనసులోనే తిట్టుకుంది.

మాలతి లేచి కమలసీటు దగ్గరకు వచ్చింది.

"ఆమె జోలి నీకెందుకు? ఆమె ఎమ్.డి. గారి తాలూకు" మాలతే సమాధానమిచ్చింది.

అతను వెంటనే కదిలి అక్కడనుంచి వెళ్ళిపోయాడు. ఆ

సాయంకాలం ఆఫీసు వదలగానే మాలతి, కమల కలుసుకున్నారు

"ఇందాక మీరు అతనితో నన్ను గురించి అలా ఎందుకు చెప్పారు?" కమల అడిగింది.

"మీరు ఆఫీసులో కొత్తగా చేరారని మిమ్మల్ని చూస్తే తెలిసిపోతోంది. అమాయకుల్ని మోసం చెయ్యడం అతనికలవాటు ఎందరో అతన్ని చావకొట్టారు. అయినా బుద్ధిరాలేదు. మిమ్మల్ని ఎక్కడ మోసం చేస్తాడోనని భయపడి అలా చెప్పాను."

మాలతి మాటలకి కమల ఆశ్చర్యపోయింది.

"ఇంతమంది ఉండగా అతనేమి చేయగలడు మాలతిగారూ!"

"హోటల్‌కి రమ్మంటాడు. స్కూటర్‌మీద దిగబెడతానంటాడు. వలలో వేసుకుంటాడు. కమలగారూ! ఆడవాళ్ళకు తెలీక అతని మాయలోపడి మోసపోతారు. ఇక్కడ కొత్తగా ఉద్యోగంలో చేరిన ఒక ఆడపిల్ల ఆత్మహత్యకూడా చేసుకుంది. అతనివల్లే ఆమె చనిపోయిందని అందరికి తెలుసు. సరియైన ఆధారాలు దొరక్క అతన్ని ఎవరు ఏమి చెయ్యలేకపోయారు. అందుకే కమలగారూ! చాలా జాగ్రత్తగా ఉండాలండి!

"ఇద్దరూ ఒకే ప్రాంతంలో ఉండడంవల్ల మాలతి వెంటే బస్సెక్కింది కమల

బస్సు చాలా రద్దీగా ఉంది. ఒకళ్ళని ఒకళ్ళు తోసేసుకుంటున్నారు. అలవాటులేని కమల ఉక్కిరిబిక్కిరయింది.

"కమలగారూ! కంగారుపడకండి. నావెనకే ఉండండి!" మాలతి మాటలకి కమలకి కాస్త ధైర్యం వచ్చింది.

"ఎవరో ఒక వ్యక్తి కమలను కావాలనే తోసేస్తున్నాడు. కమల ముందుముందుకి జరుగుతోంది.

"మిస్టర్! దూరంగా నుంచో! బుద్ధిలేదా! చెబుతోంటె" మాలతి కంఠం ఖంగుమంది.

అందరు మాలతివైపు చూసారు.

"అంత పతివ్రతవైతే బస్సు దిగవమ్మా! ఏ ఆటోలోనో వెళ్ళక పోయావా?" అతని సమాధానం విని మాలతికి మరింత కోపంవచ్చింది.

"బస్సు నీ సొంతమనుకుంటున్నావా? అక్కడ అంత స్థలముంటే నామీద పడుతున్నావెందుకు? పైగాదబాయిస్తున్నావా?" మాలతి మరింత గట్టిగా అడిగింది.

"ఇలాటి వాళ్ళకి మాటలు చాలవమ్మా! వెయ్యి రెండు! ఎవరు అడ్డువస్తారో చూద్దాం! బస్సులో వీళ్ళ వేషాలు ఎక్కువైపోయాయి!" ఒకావిడ సీట్లోంచి లేచి అతని దవడ పగలగొట్టింది.

"ముందు వాడిని బస్సు దిగమనండి!" బస్సులోని ఆడవాళ్ళంతా లేచారు.

అతను ఆ సందడిలో బస్సుదిగి పారిపోయాడు.

"నాపర్సు! నాపర్సు!" వెనకనుంచి ఎవరో అరుస్తున్నారు.

"ఏమయిందండి!" ఎందరో అతన్ని ఒకేసారి అడిగారు.

"నాపర్సు కొట్టేసి ఎవడో బస్సు దిగిపోయాడండి!"

"ఇంకేం దొరుకుతుంది బాబూ! సిటీబస్సులు దొంగలకి రౌడీలకి నిలయమైపోయాయి బాబూ!" ఎవరిదో బాధ.

"మాలతిగారూ! ఇదంతా ఏమిటండి! బస్సుదిగి మాలతి పక్కనే నడుస్తున్న కమల అడిగింది.

"కమలగారూ! ఇదంతా మామూలే! చూసారా! బస్సు దిగుతుంటె చీరలు ఎలా జారిపోయాయో" చీర కుచ్చెళ్ళు సరిచేసుకుంటూ మాలతి సమాధానమిచ్చింది.

"రోజూ ఇలాగే ప్రయాణం చెయ్యాలంటే కష్టమేనండీ" నాకు చాలా భయంగా ఉంది మాలతిగారూ!"

"కమలగారూ! ఈ మాత్రందానికే అలా భయపడితే ఎలాగండీ, ఇంకా ఎన్ని చూడాలో! మీరు కాస్త మెత్తగా ఉన్నారని తెలిస్తే! మీ ఒంటిమీద చేతులు వేస్తారు. ఈ రౌడీలేకాదు- మరోరకం దొంగ లుంటారు. మీకు తెలీనేతెలీదు. ఇంటికెళ్ళాక చూసుకుంటే మెడ ఖాళీగా కనబడుతుంది."

"ఈ పట్నాల్లో ఆడవాళ్ళు ఉద్యోగాలు చెయ్యాలంటే ఆడవాళ్ళే రౌడీలవ్వాలండీ!" ఈసారి కమలతోపాటు మాలతికూడా పకపకా నవ్వింది.

ఇంటికి వెళ్ళేటప్పటికి కమలకి చాలా నీరసంగా అనిపించింది. వెళ్ళి బట్టలు మార్చుకోకుండానే మంచంమీద వాలిపోయింది.

"కమలా! లేచి కాఫీ పెట్టు!" అత్తగారి మాటలకి ఉలిక్కిపడింది కమల.

"మీరింకా కాఫీ తాగలేదా అత్తయ్యా!" కమల నెమ్మదిగా అడిగింది. కాని మంచంమించి దిగలేకపోయింది.

"ఎప్పుడో మధ్యాహ్నం తాగాములే! మళ్ళీ కొత్త డికాషన్ వేసి కాఫీ పెడతావని!"

అత్తగారి మాటలు కమలకు చికాగ్గా అనిపించాయి. ఏదో మొండితనం ఆవరించింది.

"ఇప్పుడు నాకు ఓపికలేదత్తయ్యా! కాసేపుండి పెడతాలెండి!"

కమల కళ్ళు మూసుకుంది. ఒక అరగంట నిద్రపోయేటప్పటికి కమలకి మామూలు ఓపిక వచ్చేసింది. ఫిల్టర్ డికాషన్ తీసి కాఫీలు కలిపి అత్తమామలకి యిచ్చింది. తాను కాస్తతాగింది. ఆ చికాకంతా

పోయి కాస్త ఉత్సాహం వచ్చింది. వంట చెయ్యడం ప్రారంభించింది.

"కమలా! ఎలాఉంది కొత్త ఉద్యోగం" శ్యామసుందర్ నవ్వుతూ అడిగాడు.

"ఉద్యోగం బాగానే ఉంది. కాని కొందరు మనుష్యులే బాగులేరు" కమల ఆఫీసులో జరిగిన విషయం బస్సులో జరిగిన విషయం అంతా వివరంగా చెప్పింది.

"తన ఆఫీసులోకూడా అలాటి మగవాళ్ళున్నారు. వారి వెంట తిరిగే ఆడవాళ్ళు ఉన్నారు. కాని ఎంతోమంచి ఆడవాళ్ళూ ఉన్నారు. తన భార్య అజాతికి చెందిన స్త్రీ. కాస్త పౌరుషం ఎక్కువే అనుకున్నాడు మనస్సులో.

"మీ మాలతిలా ఉంటేతప్ప మీ ఆడవాళ్ళు ఉద్యోగాలు చెయ్య లేరు! బయట ప్రపంచంలో బతకలేరు కూడా!"

"నాకు భయంగా ఉందండీ!" కమల కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

"అలా అనకు కమలా! ధైర్యంగా ఉండాలి" కమల కన్నీళ్ళు రెండు చేతులతో తుడిచాడు.

అతని వడిలో వాలిపోయింది కమల.

ఆ రాత్రంతా ఆలోచిస్తూనే వుంది కమల. జీవితమంటే కేవలం సుఖాలలో తేలిపోవడం అనుకుంటారు కాని జీవితంలో ఎన్నో ఎత్తు పల్లాలు. ఎన్నో అగాధాలు. ఇవన్నీ దాటుకుంటు పోవడమే జీవితం. ఏ మైలురాయిదగ్గర ఆగిపోయినా అనుకున్నది సాధించలేం." కమల ఎన్నో విధాల ఆలోచించింది.

"ఆఫీసు కెడుతున్నానత్తయ్యా! వంటంతా టేబులుమీద పెట్టాను. తలుపులు జాగ్రత్తగా వేసుకోండి" కమల మాటలకి అత్తామామలు ఆశ్చర్యపోయారు. అప్పటికే శ్యామసుందర్ ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

కమల బస్సుస్టాప్ వైపు నడిచింది.

"ఎలా వచ్చావు కమలా! బస్సులోనేనా? భయం వెయ్యలేదా?"

"లేదు మాలతిగారు నిన్నటి మీ మాటలు గుర్తుకువచ్చాయి. అన్నింటిని ఎదిరించాలనే బస్సు ఎక్కాను.

"అన్నింటికి భయపడితే జీవితమే లేదు. ఈ కష్టాలు ఎదుర్కొంటేనే సుఖాలు కమలగారూ! సంసారం సాగాలంటె ఎన్నో కష్టాలు, నష్టాలు ఎదుర్కోవాలి.

మాలతి సంసారంలో తనుపడ్డ కష్టాలన్నీ చెప్పుకొచ్చింది. కమల తన సంసారాన్ని తలుచుకుంది.

"నిజమే. సంసారమంటె స్వర్గంకాదు- కాని ఈ కష్టాలన్నీ కష్టపడి దాటితే అది స్వర్గమా! కాదుకాదు. ఎప్పటికి సంసారంలో ఎన్నో కష్టాలు. వాటిపక్కనే ఎన్నో సుఖాలు." మాలతి మాటలు విని మరింత ఆలోచించింది కమల.

10-5-94

-o- -o- -o-